పేద మహిళలకు చీరలు పంపిణీ

చీరలు పంపిణీ చేస్తున్న హరిత

ప్రజాశక్తి -రాయచోటి : పట్టణంలోని రాజుల కాలనీలో శనివారం టిడిపి నాయకులు లక్ష్మీదేవి ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా 300 మంది పేద మహిళలకు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సతీమణి హరిత చేతుల మీదుగా చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మహిళలకు అండగా నిలుస్తూ వారి సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని చెప్పారు. చంద్రబాబు నాయుడు అన్ని రంగాలలో మహిళలకు పెద్దపీట వేస్తూ వారి అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని చెప్పారు. సంక్రాంతి పండుగ సందర్భంగా పెద్ద మహిళలకు చీరలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు లక్ష్మీదేవి, మాజీ జిల్లా మహిళా కార్యదర్శి సుజాత, పోలిశెట్టి సురేష్, నిక్షిత్, వెంకటసుబ్బయ్య, వెంకటరమణ, పల్లవి, అనిత, బుజ్జి, ఈశ్వరమ్మ, పార్వతి, నందిని పాల్గొన్నారు.

సామాన్యుడిపై ధరల దరువు

ఆకాశాన్నంటిన నిత్యావసరాలు, కూరగాయలు..

మధ్య తరగతి కుటుంబాల్లో కనపడని పండుగలు

ధరలు నియంత్రించడంలో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - రాయచోటి

సామాన్యుడిపై ధరలు దరువు వేస్తున్నాయి. పెరిగిన నిత్యావసరాల ధరలు ఆకాశానంటుతుండడంతో పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజానీకానికి సంక్రాంతి పండుగ దూరం కానుంది. ముఖ్యంగా ధరల నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ప్రజా సంఘాల నాయకులు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంక్రాంతి పండుగ అంటే కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఈ పండుగను ఘనంగా నిర్వహించుకుంటారు. నగర, పట్టణ ప్రాంతాలలో నివసించే వారు కూడా సొంత గ్రామాలకు వచ్చి అక్కడ నాలుగు రోజులు పాటు బంధుమిత్రులు, కుటుంబ సభ్యులతో ఆనందంగా పండుగలు జరుపుకుంటారు. ముఖ్యంగా హైదరాబాదు, విజయవాడ, బెంగళూరు, విశాఖ,తిరుపతి సుదూర ప్రాంతాల నుంచి ఉద్యోగ, వ్యాపార నిమిత్తమై వెళ్లిన వారు కూడా సంక్రాంతికి గ్రామాలకు వస్తుంటారు. ఇక గల్ఫ్ ప్రాంతాల్లో ఉండే వారు కూడా సంక్రాంతి పండుగను జరుపుకోవాలని భావిస్తారు. ఈ పండుగలను దృష్టిలో పెట్టుకొని వ్యాపారులు అమాంతంగా కృత్రిమ కొరత సృష్టించి నిత్యావసరాల ధరలను ఒక్కసారిగా పెంచేసి సామాన్యులను దోచుకుంటున్నారు. పెరిగిన ధరలను పరిశీలిస్తే..

నిత్యావసరాలు	కిలో (రూ)
కందిపప్పు	175
పెసరపప్పు	130
ఎండుమిర్చి	300
ఎర్రగడ్డలు	50
తెల్లగడ్డలు	420
శనగపప్పు	140
మినపప్పు	130
గోధుమపిండి	55
బెల్లం	65
పంచదార	45
చింతపండు	380
మైదాపిండి	40
మిర్చిపొడి	300
సన్‌ఫ్లవర్ ఆయిల్	142
పామాయిల్	135
వేరుశనగ నూనె	145

కూరగాయలు ధరలు..

పచ్చి బఠాణీ కాయలు రూ.20 /250 గ్రాములు, సొరకాయ రూ.50, బీర కాయలు రూ. 70, నిమ్మకాయలు 4/10 రూపాయలు, టమోటా కిలో రూ.30, మిరపకాయ కిలో రూ. 70, బజ్జీ మిరప కిలో రూ. 40, వంకాయ కిలో రూ .60, బెండ కిలో రూ. 60, మటిక కిలో రూ. 70, దొండ రూ.60, కాకర రూ. 60, మునగ 250 గ్రాములు రూ.30, ఆనపకాయ కిలో రూ 100, నాటు అలసంద రూ.80, చిక్కుడు రూ.70, బీట్రూట్ రూ.70, క్యారెట్ రూ.70, ముల్లంగి రూ.60, ఆలు గడ్డ దుంపలు రూ.40, అల్లం రూ.180, క్యాప్సికమ్ 80, బీన్స్ రూ.80, కీర కాయలు రూ.30, క్యాబేజీ రూ.40, కాలిఫ్లవర్ రూ.40, మటిక్కాయ రూ.60, అలసంద రూ.80, బీర కాయ రూ.60, కీరా దోసకాయ రూ.30, పప్పు దోస కాయ రూ.40, గుమ్మడికాయ రూ 30, కొత్తిమిర కట్ట రూ.20, పాలాకు రూ.20, చుక్కాకు రూ.25, సిర్రాకూ రూ.25, మెంతి ఆకు రూ.5 పొదిన రూ.40, గోగాకు రూ.10 కోయటాకు రూ.10 కరివేపాకు రూ.10, చుక్కాకు రూ.20 విక్రయిస్తున్నారు.

గ్యాస్ ధర, వంట నూనెలు కూడా అమాంతంగా పెరిగి పోయాయి. సంక్రాంతి పండుగ అంటేనే ఇళ్లల్లో వంటలతో ప్రారంభ మవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో పిండివంటలు చేసుకుని ఇంటిల్లిపాది ఆనందంగా నిర్వహించుకునేందుకు ఉత్సాహం చూపుతారు. అలాంటి పిండి వంటలు చేసుకునేలా ఈ పండగ కన్పించడం లేదు. అమాంతంగా ధరలు పెరగడంతో ప్రజలు పిండి వంటలు చేసుకుని పరిస్థితి చేరింది. ప్రత్యేక దుకాణాల్లో విక్రయిస్తున్న పదార్థాలను కొనుక్కొని వచ్చి పండగ జరుపుకోవాల్సిన దుస్థితి నెలకొంది. పూలు, పండు, స్వీట్లు, బట్టలు ధరలు కూడా ఒక్కసారిగా ధరలు పెంచేసి సామాన్యులకు అందుబాటులో లేకుండా చేస్తున్నారు. ఇది ఇలా ఉంటే పండుగ కోసం హైదరాబాదు, బెంగళూరు, విశాఖపట్నం ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులను ప్రయివేట్ వాహనాల వారు ఎక్కువ రేట్లు పెంచి దోచుకోవడం పరిపాటిగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ధరలు నియంత్రించి సామాన్యులకు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

ధరలు అమాంతంగా పెంచేశారు

సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రతి ఇంటికి బంధు వులు వస్తూ ఉంటారు. ఇదే అదునుగా భావించి వ్యాపారులు నిత్యావసర సరు కులు, కూరగాయలు అధిక రేట్లకు అమ్ము తున్నారు. పండగకు సరుకులు కొనా లంటే భయమేస్తుంది. గతంలో సంక్రా ంతి పండుగకు చంద్రన్న కానుక ఇచ్చేవారు. కూటమి ప్రభుత్వం వచ్చినా కూడా చంద్రన్న కానుక ఇవ్వకపోవడం బాధాకరం.

- లక్ష్మి దేవి, గృహిణి, రాయచోటి.

ధరలను నియంత్రించాలి

సంక్రాంతి సంబరాలు ఆకా శాన్ని అంటుతున్న నేపథ్యంలో నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు మార్కె ట్‌లలో అధిక రేట్లకు అమ్ముతున్నారు. వెంటనే సంబంధిత అధికారులు ధరలను నియంత్రించాలి. పేదవాడు పండుగ చేసుకోవాలంటే ప్రభుత్వం

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి
- మంత్రి హామీతో తాత్కాలికంగా సమ్మె విరమించిన ఎపిఎండిసి కార్మికులు

కార్మికులు, నాయకులతో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-ఓబులవారిపల్లె

ఎపిఎండిసి కార్మిక సంఘాల సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఓబులవారిపల్లె మండలం, ముక్కా వారిపల్లెలోని కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి కార్యాలయంలో మంత్రి రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌తో కలిసి ఎపిఎండిసిలోని కార్మికులకు సంబంధించిన సమస్యలపై కార్మిక సంఘాల నాయకులు, సంబంధిత అధికారులు, కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తొమ్మిది రోజులుగా ఎపిఎండిసి కార్మిక సంఘాలు తమ సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తున్నారని పేర్కొన్నారు. కార్మిక సంఘాల సమస్యలపై ఎపిఎండిసి మేనేజింగ్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సెక్రెటరీ, గనుల శాఖ మంత్రితో సంప్రదించి జనవరి 25వ తేదీ లోపల సమస్యలు పరిష్కరిస్తామని కార్మిక సంఘాలకు మంత్రి హామీ ఇచ్చారు. మంత్రి హామీతో కార్మికులు తాత్కారికంగా సమ్మె విరమించారు. ఎపిఎండిసి కార్మికులను రెగ్యులర్ చేయాలని, రెగ్యులర్ కార్మికులకు పేస్కేల్స్ కేటాయించాలని, ప్రమోషన్లు కల్పించాలని, సిఎండి టెండర్‌ను ఆపాలని, కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తూ సమ్మె చేస్తున్నారు. ఈ సమస్యలన్నీ 25వ తేదీ లోపల పరిష్కరిస్తామని మంత్రి వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎపిఎండిసి కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వడ్డే ఓబన్న త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిదాయకం

వడ్డె ఓబన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

సాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న త్యాగాలు, భావి తరాలకు స్ఫూర్తిదాయకమని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని స్టేట్ గెస్ట్‌హౌస్‌లో వడ్డే ఓబన్న జయంతి ఉత్సవాల సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఓబన్న జయంతి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉంద న్నారు. ఓబన, 11 జనవరి 1807న నంద్యాల జిల్లా, సంజమల మండలంలోని నొస్సం గ్రామంలో జన్మించారన్నారు. ఓబన్న స్వాతంత్ర్య సమరయోధుడు యుద్ధ వీరుడు సర్వ సైన్యాధ్యక్షుడు గెరిల్లా యుద్ధ వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి సర్వ సైన్యాధ్యక్షుడుగా ఉండి ఆనాటి బ్రిటిషర్లపై అక్రమ పన్ను వసూళ్లకు పాల్పడుతున్నందుకు మన దేశం స్వాతంత్రం కొరకు ఆనాడే పోరాడి ప్రాణత్యాగాలు చేశారన్నారు.

మొదటి యుద్ధ వీరుడు వడ్డే ఓబన్న : డిఆర్‌ఒ

ఆంగ్లేయులు మన దేశాన్ని ఆక్రమించుకొని అన్ని రంగాలలోని ప్రజలను దోపిడీ చేస్తున్న సమయంలో దేశంలోనే మొట్ట మొదటి సారిగా సాయుధ సైన్యాన్ని నిర్మించి బ్రిటిష్ వారిపై తిరగబడ్డ మొట్టమొదటి యుద్ధ వీరుడు వడ్డే ఓబన్న అని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్ రావు అన్నారు. కలెక్టరేట్‌లో బిసి సంక్షేమ అధికారి సురేష్ బాబు నేతృత్వంలో ఓబన్న జయంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ మాట్లాడుతూ మొదటి తరం భారత స్వాతంత్ర్యం పోరాటంలో భాగంగా బ్రిటిష్ వారిపై సాయుధ పోరాటం చేయడానికి కర్నూలు జిల్లాలోని నల్లమల ఫారెస్ట్ ఏరియా ప్రాంతంలోని వడ్డెరలను బోయలను చెంచులను 9 వేల మందికి పైగా సాయుధ సైన్యానికి వడ్డే ఓబన్న నాయకత్వం వహించి 1846లో బ్రిటిష్ అరాచక ప్రభుత్వంపై మూడు దఫాలు యుద్ధం ప్రకటించారని తెలిపారు. ఎపి వడ్డెర విద్యావంతుల వేదిక వ్యవస్థాపకులు ఈశ్వర్ మాట్లాడుతూ సిపాయిల తిరుగుబాటు కంటే పది సంవత్సరాలుముందే సైరా నరసింహారెడ్డి నేతృత్వంలో వడ్డే ఓబన్న సైన్యాధ్యక్షుడుగా ఉండి దేశ స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా మొదటిసారిగా సాయుధ పోరాటంతో దేశ స్వాతంత్ర్య పోరాటానికి వడ్డే ఓపన్న పునాది వేశారన్నారు. కార్యక్రమంలో ఎపి విద్యావంతుల వేదిక రాష్ట్ర కన్వీనర్ చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మారుతి శంకర్, ఉపాధ్యక్షులు కుంచపు రెడ్డయ్య చల్లారెడ్డయ్య, సర్పంచ్ వాసు, మాజీ సర్పంచ్ బసయ్య, విద్యావంతుల వేదిక రవిశంకర్, డాక్టర్ లక్ష్మి ప్రసాద్, బాలకృష్ణ పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్:** ఆంగ్లేయుల వెన్నులో వణుకు పుట్టించిన యోధుడు వడ్డే ఓబన్న అని ఎమ్మెల్యే షాజ హాన్ పేర్కొన్నారు. వడ్డే ఓబన్న జయంతిని పురస్కరించుకొని వడ్డెర సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించిన బైక్ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారతదేశాన్ని స్వాధీనం చేసుకోవాలనే ఆంగ్లేయుల కుట్రలని తిప్పికొట్టి, తన గుండె ధైర్యంతో వారి వెన్నులో భయాన్ని పుట్టించారన్నారు. కార్యక్రమంలో మదనపల్లె వడ్డెర సంఘం పట్టణ అధ్య క్షులు ఇడగొట్టి రెడ్డిశేఖర్, బండి ఆనంద్, పద్మనాభం, గుణశేఖర్, తమ్మిశెట్టి రామకృష్ణ, రాజా, హెచ్ఎం రెడ్డెప్ప, పల్లపు రమేష్, మేస్త్రిలు శ్రీనివాసులు పాల్గొన్నారు. **రైల్వేకోడూరు :** స్వాతంత్ర సమరయోధులు వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి కడప అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరవ శ్రీధర్, యువనేత ముక్కా సాయివికాస్‌రెడ్డి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1857 సిపాయిల తిరుగుబాటు కంటే ముందే రాష్ట్రంలోని దేవాటి గడ్డపై అధిక పన్నుల వసూళ్లకు వ్యతిరేకంగా రాయలసీమ రైతుల హక్కుల కోసం బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ వారికి వ్యతిరేకంగా పోరాటంలో పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, గుండయ్య నాయుడు, నాగేంద్ర, సంగరాజు రవికుమార్‌రాజు, శేఖర్, సుబ్బిరామిరెడ్డి, వెంకటేష్, చంద్ర శేఖర్, రాజశేఖర్ రాజు, ఉత్తరాది మహేష్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. **తంబళ్లపల్లె:** మండల కేంద్రంలో వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఓబన్న చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పెద్దేరు ప్రాజెక్టు ఆయకట్టు చైర్మన్ శివకుమార్, మాజీ సర్పంచ్ లక్ష్మిపతి సంఘం మహిళా అధ్యక్షురాలు రామలక్ష్మి, మండల అధ్యక్షులు రేపన మల్లికార్జున, సంఘం మండల నాయకులు రమేష్ బాబు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు : ఓబన్న జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే శ్రీధర్, కుడా చైర్మన్ ముక్కా

సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే షాజహాన్ బాష

ఎపి, కర్నాటక రాష్ట్రాలను కలుపుతూ రోడ్డు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను కలుపుతూ రాయల్పాడు నుంచి ముదుమడుగు మీదుగా అటవీ ప్రాంతంలో రోడ్డు ఏర్పాటుకు రెండు రాష్ట్రాల ప్రజాప్రతినిధులు శనివారం సమావేశమయ్యారు. మదనపల్లి గ్రామీణ మండలం మిట్టమర్రి గ్రామ సరిహద్దు వరకు రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. కర్ణాటక రాష్ట్రం శ్రీనివాసపురం ఎమ్మెల్యే వెంకటశివారెడ్డి, కోలార్ పార్లమెంట్ సభ్యులు మల్లేష్, మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా కర్ణాటక, ఆంధ్ర సరిహద్దు అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. దశాబ్దాల కాలంగా రోడ్డుకు నోచుకోని గ్రామాలకు రోడ్డు వేయాలని చర్చించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకారంతో త్వరగా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు తోడ్పాటు అందిస్తానని ఎమ్మెల్యే షాజహాన్ బాష ప్రకటించారు. శ్రీనివాసపురం ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి ఎమ్మెల్యే షాజహాన్ బాష చొరవను అభినందించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు జె.వి.రమణ, సర్పంచ్ ఆనందరెడ్డి, జెసిబి వేణు, రాయచోటి శశి కుమార్, జీవీ నాయుడు, కమలామర్రి కృష్ణ, సురేందర్ రెడ్డి, గురునాథ్ యాదవ్, జెసిబి ఈశ్వర్ నాయుడు, మేడిపల్లి శంకర్ నాయుడు, శ్యామలమ్మ, బాలు. పూలకుంట్ల హరి బాబు శ్రీనివాసులు నాయుడు, రెడ్డి రాయలు, చలపతి, ఆంధ్ర కర్ణాటక సరిహద్దు గ్రామాల ప్రజలు, రెవెన్యూ పంచాయతీరాజ్, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

పరిశ్రమల సహకారంతో ఉన్నత విద్యాభివృద్ధి : విసి

ప్రజాశక్తి - కడప అర్బన్ : పరిశ్రమల సహకారంతోనే ఉన్నత విద్య అభివృద్ధి సాధ్యమవుతుందని విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఉన్నత విద్యలో ప్రయోగాత్మక అభ్యసనం, ఒకే దేశం ఒకే పరీక్ష, నిరంతర సమగ్ర మూల్యాంకన పద్ధతుల, వినూత్న పద్ధతుల అమలుపై సౌత్ జోన్ వైస్ ఛాన్సర్ల సమావేశంలో చర్చించామని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమిళనాడులోని వెల్లూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలోని అన్నా ఆడిటోరియంలో 'అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్శిటీస్ (ఏఐయు)' ఈనెల 10,11 తేదీలలో 'పునరాలోచన అసెస్‌మెంట్ మూల్యాంకనం'పై రెండు రోజుల సౌత్ జోన్ వైస్-ఛాన్సలర్ల సమావేశం నిర్వహించారని చెప్పారు. స్టార్టప్‌లు, పెట్టుబడిదారులు, ఇంక్యుబేటర్‌లతో సహకారాన్ని అన్వేషించడం ద్వారా ఆవిష్కరణలను పెంపొందించడంలో విశ్వవిద్యాలయం నిబద్ధతతో ఉందన్నారు. విద్యా సంస్థలు పరిశ్రమలతో అనుసంధానమై పనిచేస్తే నైపుణ్యత గల విద్యార్థులు సమాజం లో వస్తారని ఆ దిశగా ప్రయత్నాలు కొనసాగాలన్నారు. విద్యాలయంలో పర్యావరణ వ్యవస్థను పెంపొందించడానికి మద్దతు ఇచ్చే మార్గాలను అన్వేషించడానికి టి-హబ్ అధికారులతో సంభాషించామన్నారు. దక్షిణ భారతదేశంలోని దాదాపు 100 ఉన్నత విద్యా సంస్థల విసిలు ఒకచోట భేటీ అయ్యారని చెప్పారు.

కడప బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప బాలోత్సవం 2వ పిల్లల పండుగ ఫిబ్రవరి 1, 2న సెయింట్ జోసెఫ్ బాలుర పాఠశాలలో ఉంటుందని కడప బాలో త్సవం అధ్యక్షులు గోపాల్ తెలిపారు. శనివారం ఎస్‌వి ఇంజినీరింగ్ కళాశాలలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ జీవితానికి చదువు చాలా ముఖ్యమే, కానీ పిల్లలు ఒత్తిడితో కాక ఇష్టపడి చదివే వాతావరణం కావాలని పేర్కొన్నారు. వారి అభిరు చులను, ఆసక్తులను, సృజనను, జ్ఞాన తృష్ణను ప్రోత్సహించే పరిస్థి తులు ఉండాలన్నారు. గౌరవాధ్యక్షులు నాగమునిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత రాకెట్ యుగంలో మానవ సంబంధాలు, కుటుంబ బంధాలు, స్నేహ భావాలు బలహీనపడ్డాయని చెప్పారు. సహకారతత్వం సడులు తోందని, పెద్దవారికి, సాటి వారికి సేవ చేయాలనే భావన కొరవడు తోందని పేర్కొన్నారు. తల్లిదండ్రులకు పనుల వత్తిడితో పిల్లలకు మొబైల్ ఇవ్వడం ద్వారా చదువులలో వెనుకబడటం, ఆటపాటలు లేక ఊబకాయం రావడం, మత్తు పదార్థాలకు అలవాటు పడటంలాంటివి సర్వసాధారణమైందన్నారు. ప్రధాన కార్యదర్శి రాహుల్ మాట్లాడుతూ చదువులతో కష్టపడే పిల్లలకు బాలోత్సవం ఓ పండుగ, ఒక ఆటవిడుపు, ఒక వేడుక, ఒక మహోత్సవమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వీరసుదర్శన్‌రెడ్డి, నాయకులు బాలఎల్లారెడ్డి, సత్యనా రాయణ, కార్యదర్శులు లక్ష్మీరాజా, వెంకటసుబ్బయ్య, రామకృష్ణారెడ్డి, శ్రీనివాసులు, యల్లేశ్వరావు, శివరాం, అరుణ, వెంకటేశ్వర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, సుందరయ్య, మధుసూదన్ పాల్గొన్నారు.

ఆవుల వెంకటేశ్వర్లుకు వైవీయూ డాక్టరేట్

ప్రజాశక్తి- కడప అర్బన్

వైవీయూ పీజీ కళాశాల అప్లయిడ్ మ్యాథమ్యాటిక్స్ స్కాలర్ ఆవుల వెంకటేశ్వర్లుకు యోగి వేమన విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించింది. అప్లయిడ్ మ్యాథమెటిక్స్ విభాగసహ ఆచార్యులు డాక్టర్ ఎస్.సునీత పర్యవేక్షణలో 'థిరిటికల్ ఇన్వెస్టిగషన్ ఆఫ్ ద క్యారెక్టర్ స్టిక్స్ ఆఫ్ హీట్ అండ్ మాస్ ట్రాన్సర్ ఆన్ వేరియస్ హైబ్రిడ్ నానో ఫ్లూయిడ్స్ ఓవర్ ఏ స్ఫేర్ బై యూజింగ్ స్టాటిస్టికల్ టూల్స్' అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథం విశ్వవిద్యాలయానికి సమర్పించారు. ఆవుల వెంకటేశ్వర్లుకు డాక్టరేట్ సర్టిఫికెట్‌ను వైవీయూ పరీక్షల నిర్వహణ అధికారి ఆచార్య కె.ఎస్.వి కృష్ణారావు జారీ చేశారు. పరిశోధకుడు రాసిన పరిశోధనా పత్రాలు పలు జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. డాక్టరేట్ అందుకున్న సందర్భంగా ఆవుల వెంకటేశ్వర్లు ను, గైడ్ డాక్టర్ ఎస్.సునీత ను విసి ఆచార్య కె. కృష్ణారెడ్డి, ప్రిన్సిపల్ ఆచార్య ఎస్. రఘునాథ్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ అప్లైడ్ మ్యాథమెటిక్స్ విభాగ అధ్యాపకులు పరిశోధక విద్యార్థులు అభినందించారు.

నేడు మదనపల్లెలో 'కుల దహనం' సభ : 'బాస్'

మాట్లాడుతున్న పిటిఎం శివప్రసాద్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

భారతీయ అంబేద్కర్ సేన (బాస్) 13వ వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం మదనపల్లెలో 'కుల దహనం' పేరుతో కుల నిర్మూలనా చైతన్య సభను నిర్వహిస్తున్నామని, ఈసభకు బాస్ కార్యకర్తలు, నాయకులతో పాటు కుల నిర్మూలనా వాదులు స్వచ్ఛందంగా తరలివచ్చి జయప్రదం చేయాలని ఆ సంస్థ వ్యవస్థాపకుడు పిటిఎం శివప్రసాద్ విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన స్థానిక బాస్ కార్యాలయంలో విలేక రులతో మాట్లాడుతూ భారతదేశాన్ని పట్టి పీడిస్తున్న అతిపెద్ద జబ్బు కుల వ్యవస్థ అని, అందుకే భారతదేశంలో అనేకమంది సంఘ సంస్కర్తలు కుల నిర్మూలన కోసం ఉద్యమించారని, కుల దహనం పేరుతో బాస్ చెప్పట్టిన కుల నిర్మూలనా చైతన్య కార్యక్రమం దీనికి కొనసాగింపేనని చెప్పారు. మదనపల్లె టౌన్, బెంగళూరు రోడ్డులోని కాలనీగేట్ అంబేద్కర్ విగ్రహం వెనుక డాక్టర్ అంబేద్కర్ ప్రాంగణంలో ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటల నుండి కుల దహనం సభ జరుగుతుందని తెలిపారు. ఈ చారిత్రక సభకు తమిళనాడు రాష్ట్రం నుండి వీసీకే పార్టీ సౌత్ ఇండియా కో-ఆర్డినేటర్ బాలసింగం, కరా?టక రాష్ట్రం నుండి గవర్నమెంట్ ఆఫ్ కర్ణాటక జానపద అకాడమీ చైర్మన్ గొల్లహళ్లి శివప్రసాద్, దళిత సంఘర్షణ సమితి (డిఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేష్, తెలంగాణ రాష్ట్రం నుండి వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జిలుకర శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ నుండి సామాజిక విశ్లేషకులు దుర్గం సుబ్బారావు, కర్నూలు నుండి బహుజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కొమ్ముపాలెం శ్రీనివాస్, అమరావతి నుండి స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మేడికొండ సునీల్, యువ పారిశ్రామిక వేత్త మెండెం శ్రీనివాస్, వి.కోట నుండి బాస్ స్టేట్ కన్వీనర్ ఉలగనాథన్ గణపతి తదితరులు అతిధులుగా విచ్చేయుచున్నట్లు తెలిపారు. సభలో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ కు చెందిన కళాకారులు సంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తారని శివప్రసాద్ తెలిపారు.

మొద్దునిద్ర

ప్రజాదృష్టి

ఉమ్మడి జిల్లాలోని వ్యవసాయం, విద్య, వైద్య రంగాల్లో సంక్షోభం నెలకొంది. ఒకవైపు కరువు, మరోవైపు విద్య, వైద్య రంగాల పాలనా వైఫల్యాలు ఆందోళన కలిగించడం తెలిసిందే. ఆర్నెళ్ల కిందట కడప జిల్లా డిఇఒ విధుల్లోకి వచ్చినప్పటి నుంచి వివాదా స్పదం వైఖరిని అవలంభించడం విమర్శలకు కారణంగా మారింది. జిల్లాలోని 35 మండలాలకు చెందిన సుమారు ఏడు వేల మంది ఉపాధ్యాయ, సిబ్బందిల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. నెల రోజుల కిందట జిల్లాలోని 2,328 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థుల బయోడేటాను సకాలంలో అప్‌లోడ్ చేయలేదనే కారణంతో 800 మంది ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులకు నోటీసులు జారీ చేయడం వివాదాస్పదంగా మారింది. జిల్లాలోని ఉపాధ్యాయ సంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. అయినప్పటికీ డిఇఒ తగ్గలేదు. ఇటీవల ఇలియాస్‌బాషా అనే ఉపాధ్యాయుడు మృతి చెందడం వెనుక డిఇఒ నిర్లక్ష్య వైఖరి ఉందనే కారణంతో జిల్లా ఉపాధ్యాయ లోకం ఉద్యమబాట పట్టింది. ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థుల ఆన్‌లైన్ వివరాలను అప్‌లోడ్ అంశంలో నిర్లక్ష్యం నెలకొందనే ఉద్దేశంతో జారీ చేసిన నోటీసుల ఘటనలో ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి మొదలుకుని ఉపాధ్యాయ సంఘాల నాయకులు తీవ్రంగా వ్యతిరేకించిన సంగతి తెలిసిందే. అప్పట్లో డిఇఒ తన వైఖరిని కాస్త సడలించుకున్నట్లు కనిపించింది. తాజాగా ఓ ఉపాధ్యాయుని మృతి వెనుక డిఇఒ కఠిన వైఖరి ఉందనే ఆరోపణల నేపథ్యంలో జిల్లాలోని ఉపాధ్యాయ సంఘాలన్నీ 10 రోజులుగా ముక్తకంఠంతో ఈ డిఇఒ మాకొద్దు అంటూ నినదిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలో బుద్ధిజీవుల ఆందోళనలు పెద్ద ఎత్తున జరుగుతున్నప్పటికీ ఎవరికీ పట్టడం లేదు. కలెక్టర్ మొదలుకుని రాష్ట్ర విద్యాశాఖా కమిషనర్, విద్యాశాఖా మంత్రి లోకేష్ వరకు ఎవరికి పట్టకపోవడం ఆందోళనకరం. పాలకుల నిర్లక్ష్యపు వైఖరి కారణంగా జిల్లాలోని ఉపాధ్యాయ సంఘాలన్నీ ముక్తకంఠంతో ఆందోళన కొనసాగిస్తుండడం అందరినీ ఆకర్షిస్తోంది. అన్నమయ్య జిల్లాలోని ఖరీఫ్ కరువు పరిస్థితులను అంచనా వేయడంలో పాలకులు మొద్దునిద్రను నటించడం ఆందోళనకరం. 2024-25 ఖరీఫ్ సీజన్‌లో 21 మండలాల్లో కరువు కరాళ నృత్యం చేస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. 2024-25 ఖరీఫ్ సీజన్ ముగిసింది. రబీ సీజన్ సైతం ముగింపు దశకు చేరుకుంది. దశలో కేంద్ర ప్రభుత్వం కరువు బృందాలను పంపించడం వల్ల కరువు పరిస్థితుల్ని ఎలా అంచనా వేస్తుందో తెలియడం లేదు. ఏ పారామీటర్ల ఆధారంగా కరువు తీవ్రతను అంచనా వేస్తుందో తెలియడం లేదు. అనంతరం కరువు నివారణకు ఎటువంటి సిఫారసులు చేస్తుందో తెలియడం లేదు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరువు పరిస్థితుల నెలకొన్న సీజన్‌లో అతివృష్టి, అనావృష్టి పరిస్థితులను అంచనా వేయడానికి కరువు బృందాలను పంపించాలి. అప్పుడే వాస్తవిక అంచనాలకు రావడానికి అవకాశం ఉంటుందని గ్రహించాలి. వాస్తవ అంచనాల ఆధారంగా రైతాంగాన్ని ఆదుకోవడంపై అవగాహన ఏర్పడుతుంది. వాస్తవిక అవగాహన నేపథ్యంలో ప్రభుత్వాలు ఏమేరకు సహకారాన్ని అందించాలనే అంశంపై స్పష్టత వస్తుందనడంలో సందేహం లేదు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

అభాగ్యులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

రైల్వేకోడూరు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. మానవత కార్యదర్శి, బోర్డు సభ్యులు మానవత సభ్యులు వెంకటరెడ్డిపల్లి వాస్తవ్యులైన కొండారు సుబ్రహ్మణ్యం రాజు, స్థానిక సాయిబాబా గుడి వద్ద నిరాశ్రయులైన వృద్ధులకు, భిక్షాటకులకు దుప్పట్లు అందజేశారు. చలి తీవ్రతను తట్టుకోలేని నిర్భాగ్యులకు దుప్పట్లు పంపిణీ చేయడం వీరి దాతృత్వం స్ఫూర్తిదాయకమని వారి కుటుంబ సభ్యులకు సంస్థ తరఫున అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మానవత చైర్మన్ కె. ప్రసాద్ వర్కింగ్ చైర్మన్ టి. వెంకటరమణ యాదవ్, ప్రెసిడెంట్ యం. చంద్రమోహన్ రాజు,డైరెక్టర్ శ్రీనివాసులు, ఉదయ శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

'నీట్'లో మెరిసిన విద్యార్థులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-రామాపురం

2024 విద్యా సంవత్సరంలో నిర్వహించిన నీట్ మెడిసిన్ ఇంజినీరింగ్ ఎంట్రన్స్ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులుసాధించిన అన్నమయ్య జిల్లా విద్యార్థిని విద్యార్థులకు శ్రీ సద్గురు దుర్గ మాతాజీ గంగిశెట్టి రంగనాయకమ్మ ఎడ్యుకేషనల్ సేవా సమితి ఆధ్వర్యంలో ఏడాదికి రూ.10వేల చొప్పున నాలుగు సంవత్సరాలు ఆర్థిక సాయం (స్కాలర్‌షిప్) అందిస్తామని ఎడ్యుకేషన్ సొసైటీ నిర్వాహకులు టివి.సత్యమయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20వ తేదీ లోపల విద్యార్థులు ర్యాంక్ కార్డు , అడ్మిషన్ స్లిప్, ఆధార్ కార్డు తీసుకొని తమను సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాలకు 9441402901 నెంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి-రామాపురం

ఎస్ఐ వెంకట సుధాకర్‌రెడ్డి

సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలో అసాంఘిక కార్యక్రమాలకు, కోడి పందేలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ వెంకట సుధాకర్‌రెడ్డి హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా పోలీసులు కొంతమంది మఫ్టీలో, మరి కొందరు యూనిఫాంలో తిరుగుతుంటారని తెలిపారు. కోడిపందేలు, పేకాట, అశ్లీల నృత్యాలు వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని చెప్పారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడి కేసుల బారి నపడి ఇబ్బందిపాలై బాధపడవద్దని అన్నారు. గ్రామాలలో ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు తెలిసినవారు పోలీసులకు గానీ, 9121100558 నంబర్‌కు సమాచారం అందించాలని, అటువంటి వారి వివ రాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. **లక్కిరెడ్డిపల్లి:** సంక్రాంతి పండుగను అవకాశంగా తీసుకొని ఎవరైనా కోడిపందేలు, పేకాట, నాటుసారా మరి ఏ ఇతర అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినట్టయితే అటువంటి వారిపైన చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రవీంద్ర పేర్కొన్నారు మండలంలో ఎక్కడైనా కానీ ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే 9121100555 నంబర్‌కు సమాచారం ఇవ్వవలసిందిగా కోరారు.

క్రికెట్ విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్ : ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు డిసెంబర్ 30న ప్రభుత్వ ప్రయివేట్ జూనియర్ కళాశాల విద్యార్థులకు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఇందులో విజేతలకు మెడల్స్, కప్‌ను మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్ మోరే లక్ష్మణ్‌రావు ముఖ్యంగా అతిథిగా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా సహాయ కార్యదర్శి, మోరే లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా ముఖ్యమన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయన్నారు. గెలుపోటములు సహజమన్నారు. క్రీడా స్ఫూర్తితో గెలిచి ముందుకు సాగిన ఇరు జట్లను అభినందించారు. స్థానిక వివేకానంద జూనియర్ కళాశాల, షిరిడి సాయి జూనియర్ కళాశాల, ఎస్పీ జూనియర్ కళాశాల విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు హరిబాబు, పవన్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

రక్తదాతలుగా మారాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : ఆరోగ్యవంతులు రక్తదాతలుగా ఉండాలని సర్ సివి రామన్ సైన్స్ క్లబ్ అధ్యక్షులు వంశీకృష్ణ కోరారు. శనివారం వైఎస్ మునిసిపల్ గర్ల్స్ హైస్కూల్‌లో సర్ సివి రామన్ సైన్స్ క్లబ్ ప్రొద్దుటూరు ఆధ్వర్యంలో రక్త వర్గ పరీక్షలు, హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ హిమోగ్లోబిన్ 16నుంచి 60ఏళ్ల వారు అవసరమైన వారికి రక్తదానం చేయవచ్చున్నారు. క్లబ్ సెక్రటరీ అల్లా బకష్ మాట్లాడుతూ హిమోగ్లోబిన్ శాతం ఆరోగ్యవంతులకు 14-17వరకు ఉండాలన్నారు. 9శాతం కన్నా తక్కువ ఉంటే అనీమియాతో బాధ పడతారని తెలిపారు. సమతుల ఆహారం తీసుకుని హిమోగ్లోబిన్ పెంచుకోవాలన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ శ్రీకాంత్, 40 మంది ఉపాధ్యాయులు, పిల్లలకు రక్త పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు గోపీనాథ్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

14న రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని చెముల్లపల్లెలో సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. 13న పూజా కార్యక్రమాలతోపాటు ముగ్గుల పోటీలు, 14న రాష్ట్రస్థాయి సేద్యపు ఎద్దుల బండలాగుడు పోటీలు ఉంటాయన్నారు. బండలాగుడు పోటీల్లో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతిగా రూ.25వేల 116, రెండవ బహుమతిగా రూ.20వేల 116, మూడవ బహుమతిగా రూ.15,116 అందజేయనున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 15న పార్వేట సందర్భంగా ఆర్కెస్ట్రా, కోలాటం, గ్రామోత్సవం ఉంటాయన్నారు.

పాడి రైతుల సంక్షేమానికి కృషి : ఎమ్మెల్యే

చిట్వేలిలో మినీ గోకులాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, సాయివికాస్‌రెడ్డి

ప్రజాశక్తి-చిట్వేలి

పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పేర్కొన్నారు. మండలంలో పోళ్లోపల్లి, తిమ్మయ్యగారిపల్లి పంచాయతీ చిల్లావాండ్లపల్లి నూతనంగా నిర్మించిన మినీ గోకులాను టిడిపి యువనాయకులు ముక్కా సాయి వికాస్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా పాడి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అధిక నిధులు ఖర్చు చేసి వారి సంక్షేమానికి కృషి చేస్తోందని అన్నారు. ఉపాధి హామీ అధికారులు సమన్వయంతో నియోజకవర్గానికి మంజూరైన మినీ గోకులాలను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకరావాలని సూచించారు. మినీ గోకులాల వల్ల పాడి పశువులు, ఎండ, వాన, వడదెబ్బకు గురి కాకుండా ఆరోగ్యంగా ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో రాజుకుంట సర్ప ంచ్ గుత్తి నర్సింహులు, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. **నిమ్మనపల్లె :** పాడి రైతుల అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మదనపల్లి శాసనసభ్యులు షాజహాన్‌బాషా అన్నారు. శనివారం నిమ్మనపల్లి మండలంలోని బండ్లపైలో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా పాడి రైతులకు మంజూరై నిర్మాణాలను పూర్తి చేసుకున్న గోకుల షెడ్లను, స్థానిక నాయకులు అధి కారులతో కలసి ప్రారంభించారు. రాజంపేట పార్లమెంటరీ టిడిపి అధికార ప్రతినిధి ఆర్‌జె వెంకటేష్, మాజీ జడ్‌పిటిసి సుజాత, రాచవేటివారిపల్లి సర్పంచ్ సుబ్రమణ్యం, టిడిపి నాయకులు ఎమ్మెల్యే వెంట పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తున్నాదని అన్నారు. బండ్లపై లో రూ.2.30 లక్షలతో నిర్మించిన గోకుల షెడ్డును ప్రారంభించారు. మండల వ్యాప్తంగా ఇప్పటివరకు 25 గోకుల షెడ్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. వీటిని నిర్మాణాల్లో దాదాపు 90 శాతం ప్రభుత్వం రైతులకు సబ్సిడీ రూపంలో అందిస్తున్నాదని వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పరమేశ్వర్ రెడ్డి, ఎపిఒ రమేష్, పశు వైద్యాధి కారి డాక్టర్ సురేష్, ఎఒ రమేష్ బాబు, ఆర్డబ్ల్యూఎస్ ఎఇ మిధున్ చక్రవర్తి పాల్గొన్నారు. **రామాపురం :** పాడి రైతులు ప్రభుత్వం నిర్మించే మినీ గోకులాలను సద్వినియోగం చేసుకోవాలని టిడిపి నాయకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సరస్వతిపల్లెలో నూతనంగా నిర్మిం చిన మినీ గోకులాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మీప్రసాద్ రెడ్డి మాట్లాడు తూపాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందన్నారు. పశుసంవర్ధక శాఖ అధి కారులు, ఉపాధి హామీ అధికారులు సమన్వయంతో నియోజకవర్గానికి మంజూరైన మినీ గోకులా లను వందశాతం పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. మినీ గోకులాల వల్ల పాడి పశువులు, ఎండ, వాన, వడదెబ్బకు గురి కాకుండా ఆరోగ్యంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పశు సంవర్ధక శాఖ అధికారులు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. **రామసముద్రం :** పాడి పరిశ్రమ నమ్ముకొని జీవనాధారం చేసుకునే పాడి రైతులకు మినీ గోకులం షెడ్లు ఎంతగానో ఉపయోగపడుతుతాయని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు. శనివారం మండలంలోని నారిగానిపల్లి పంచాయతి పూలకుంట్లపల్లి గ్రామంలో ఎన్‌ఆర్‌ఇజిఎస్ పథకం ద్వారా రాయితీపై తలారి శ్రీనివాసులు నిర్మించుకున్న మినీ గోకులం షెడ్లను ప్రారంభించారు. ఇప్పటి వరకు మండలానికి 29 మినీ గోకులం షెడ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో అదనంగా మరో 50 మినీ గోకులం షెడ్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలలో ఎవరైనా పెద్ద ఆసుపత్రిలలో వైద్యం పొందినట్లైతే వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఉపశమనం కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు విజయ్ కుమార్ గౌడ్,సర్పంచ్ ఇంజమ్ వెంకటరమణ, సీనియర్ నాయకులు రామ్మూర్తి, వెంకటరమణ, శ్రీనివాసులు గౌడ్, కదిరప్ప, నాగరాజ, రంగాని వెంకటేష్, మాల మహానాడు మండల అధ్యక్షులు కృష్ణప్ప పాల్గొన్నారు.

నిమ్మనపల్లె : మినీ గోకులాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

పేదలకు వరం సిఎం సహాయనిధి : 'నల్లారి'

బాధితులకు సిఎం సహాయనిధి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-కలికిరి

సిఎం సహాయనిధి పేదలకు వరంలాంటిందని ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలో అనారోగ్యం, ప్రమాదాలు, మంచం పట్టిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద పీలేరు నియోజక వర్గంలో లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకున్నారు. ముగ్గురు బాధితులు సహాయనిధి చెక్కులు మంజూరు కావడంతో లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు తన సొంత గ్రామం నగిరిపల్లిలో చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి కార్యకర్తలకు ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు, హామీలు పూర్తిగా అమలు చేసే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. నియోజవర్గ స్థాయిలో కూటమి కార్యకర్తలు నల్లారి అభిమానులు అధైర్య పడాల్సిన అవసరం లేదని, నాకు సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి అన్ని విధాల అండగా ఉంటానని భరోసానిచ్చారు.

ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థలోని ముత్తు ఆంగ్ల మాధ్య పాఠశాలలో శనివారం ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు జరిగాయి. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఎంపీ ఆనందన్, అడ్మిన్ డైరెక్టర్ డాక్టర్ జీవీఎస్ బాబు, సంస్థ జనరల్ సెక్రటరీ కవిత రాణి, ముత్తు ఆంగ్ల మాధ్యమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరిజమ్మాల్‌తో పాటు పాఠశాల ఉపాధ్యాయ బృందం కలిసి రంగవల్లులతో వేడుకలు ప్రారంభించారు. భోగి మంటలతో ఆశ్రమంలో ఉన్న గోవులకు పూజ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యదర్శి కవిత రాణి మాట్లాడుతూ సంక్రాంతి పండగను పట్టణాల్లో స్థిరపడిన పల్లెల వాసులందరూ తమ స్వగ్రామాలకు చేరుకుని కన్నులపండగగా, కుటుంబ సమేతంగా జరుపుకునే తెలుగు వారి పండగ అన్నారు. విదేశాల్లో ఉంటూ సంస్థ కోసం రూ.10,500లు విలువ చేసే బీరువా వితరణ చేసిన గౌతమ్, వారి కుటుంబ సభ్యులుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రంగవల్లులు వేసిన వారికీ సంస్థ అధ్యక్షులు, విశ్రాంత ఉపాధ్యాయులు రామకృష్ణతో కలిసి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందచేశారు.

డాల్ఫిన్ స్కూల్లో సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు

విజ్‌డమ్ స్కూల్..

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

స్థానిక పట్టణంలోని గాంధీనగర్‌లోని విజ్‌డమ్ సిబిఎస్‌ఇ స్కూల్‌లో విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ టి.ప్రదీప్ ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల తల్లులకు రంగోలి పోటీలు నిర్వహించారు. విజేతలకు ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ వెరోనికారెడ్డి బహుమతులు అందజేశారు. చైర్మన్ డాక్టర్ ప్రదీప్ సంక్రాంతి పండుగ విశిష్టత గురించి విద్యార్థులకు వివరించి, భోగిపళ్ళతో ఆశీర్వదించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిం చారు. హరిదాసు, సోది చెప్పే మహిళ వేషధారణలతో విద్యార్థులు అల్లరించారు. కార్యక్రమంలో అడ్మిన్ డైరెక్టర్ టి.మదన్మోహన్, ప్రిన్సిపల్ టి.ప్రియాంక, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజ్‌డమ్ స్కూల్లో సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు

డాల్ఫిన్ డెల్ హైస్కూల్‌లో..

పట్టణంలోని డాల్ఫిన్ డెల్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో కరస్పాండెంట్ పంజం సుకుమార్ రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులు సంప్రదాయ దుస్తులు ధరించి హరిదాసు, సోది చెప్పే మహిళా వేష ధారణలో విద్యార్థులు అలరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి భోగిమంట వేసి సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మదనపల్లి : సంక్రాంతి సంబరాల్లో చైతన్య సంస్థ ప్రతినిధులు

వ్యర్థాలతో ఉన్న ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణం

అధ్వానం..ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణం

- చెత్తాచెదారంతో నిండిన వైనం
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రమైన గాలివీడులోని ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణంలో చెత్తా, చెదారంతో నిండిపోయింది. పారిశుధ్య పనులు చేసే వారులేక చెత్త దిబ్బలా తయారైంది. వ్యర్థాలతో నిండిన బస్టాండ్‌కు రావాలంటే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో బస్టాండ్ పరిశుభ్రతకు ఒకరిని నియమించి శుభ్రం చేయించే వారని, ఇప్పుడు ఉన్న ఒక్కరిని తొలగించారని స్థానిక ప్రజలు చెబుతున్నారు. పారిశుధ్య లోపంతో దుమ్ము దూళి ఎక్కువై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక బస్టాండ్‌లో పరిస్థితి దుర్భరంగా ఉందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆర్‌టిసి అధికారులు దృష్టి పెట్టి పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

పెద్దూర్‌లో రోడ్డుపైనే మురుగునీరు

- పట్టని అధికారులు

ప్రజాశక్తి-గాలివీడు : స్థానిక పంచాయతీలో పెద్దూర్‌లో రోడ్డుకు మురుగునీరంతా రోడ్లపై చేరి దుర్వాసన వెదజల్లుతోందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురురు కాలువ ఆర్‌అండ్‌బి స్థలాన్ని ఆక్రమించి సర్వే చేసి మార్కింగ్ ఇచ్చారు కానీ ఇంతవరకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని అన్నారు. డ్రెయినేజీ కాలువలు నిండి మురుగు నీరంతా రోడ్డుపై ప్రవహిస్తోందని చెబుతున్నారు. పెద్దూరు ద్వారా బలిజపల్లి, నడింపల్లి, మూలపల్లి, దానంరెడ్డిగారిపల్లి వరకు ప్రజలు ముగురునీటిలో వెళ్లాల్సి వస్తోందని పేర్కొన్నారు. కాలువ నిండిన తర్వాత ఆ నీరు ఎక్కడికి పోవాలనేది ప్రశ్నార్థకంగా మిగిలిపోయిందన్నారు. కాలువల్లోని నీరంతా పొలాల్లోకి వెళుతుండటంతోరైతులు పొలంలోకి మురుగనీరు రాకుండా అడ్డంకులు పెట్టుకున్నారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎవరికి ఇబ్బందులు కలుగకుండా డ్రెయినేజీ వ్యవస్థను మెరుగు పరచి మురుగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

కంప చెట్లను తొలగించరూ...!

ప్రజాశక్తి-సుండుపల్లి : మండల కేంద్రం సుండుపల్లికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లు పెరగడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని వెంటనే వాటిని తొలగించాలని గ్రామస్తులు నాగయ్య, నారాయణ తెలిపారు. ప్రతి ని త్యం ఈరోడ్డు ద్వారా ట్రాక్టర్లు, స్కూల్‌బస్సులు, ద్విచక్రవా హనాలు రాకపో కలు సాగిస్తుంటాయని అన్నారు. కంపచెట్లు ఏపుగా పెరగడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉండటంతో భయం..భయంగా ప్రయాణాలు సాగించాల్సి వస్తోందని అం టున్నారు. ఈ విషయాన్ని మండల అభివృద్ధి అధికారి దృష్టికి తీసుకెళ్లిలా ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధి కారులు స్పందించి రోడ్డుకి ఇరువైపులా కంపచెట్లను తొలగించాలని కోరుతున్నారు.

రోడ్డుకు ఇరువైపు ఏపుగా పెరిగిన కంపచెట్లు

క్రైం కార్నర్

గోడకూలి డ్రైవర్ మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రమేష్ రెడ్డి (ఫైల్ ఫోటో)

గోడకూలి హిటాచి డ్రైవర్ దుర్మరణం చెందాడు. ఈ సంఘటన శనివారం మదనపల్లె మండలంలో జరిగింది. సిఐ కళా వెంకట్రమణ కథనం మేరకు.. సత్యసాయి జిల్లా కదిరికి చెందిన శ్రీకాం త్ వద్ద కదిరి పట్టణం అడపాల వీధికి చెందిన రమేష్ రెడ్డి(40) గత 15 ఏళ్ల గా హిటాచి డ్రైవర్‌గా పనిచేస్తు న్నాడు. మదనపల్లె మండలం, సిటియం గ్రామంలోని స్పిన్నింగ్ మిల్ నిర్మాణాలను హిటాచితో తొలగిస్తున్న క్రమంలో గోడ కూలి ఒక్కసారిగా డ్రైవర్ రమేష్‌రెడ్డిపై పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న తాలూకా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహం హిటాచీలో ఇరుక్కపోవడంతో వెలికి తీయడానికి చాలా శ్రమించాల్సి వచ్చింది. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చిన పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

కన్న బిడ్డలపై అఘాయిత్యానికి పాల్పడిన తండ్రి అరెస్టు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కన్న కూతుళ్ళ పై అఘాయిత్యానికి పాల్పడిన తండ్రి ని శనివారం అరెస్టు చేసినట్లు డిఎస్పీ కొండయ్య నాయుడు తెలిపారు. డిఎస్పి తెలిపిన వివరాల మేరకు.. నిమ్మనపల్లె మండలం, కొండయ్యగారిపల్లె పంచాయితీ దాసరిపేటకు చెందిన చెన్నూరు బోయకొండ మద్యానికి బానిసై ఇంట్లో ఉన్న తన ఇద్దరు కూతుళ్లపై కొన్నాళ్లుగా అఘాయిత్యం చేస్తూ వచ్చాడు. పిల్లలు విషయాన్ని అమ్మమ్మ దృష్టికి తీసుకురావడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు భార్య తన భర్తపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు విచారణ చేపట్టిన సిఐ రమేష్ నిందితుడిపై ఫోక్సో కేసు నమోదు చేశారు. నిందితుడు బోయకొండనుఅరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు.

రెండు పాడి ఆవులు అపహరణ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

తమ కుటుంబానికి జీవనాధారమైన రెండు పాడి ఆవులను గుర్తు తెలియని దుండగులు అపహరించుకొని పోయారని పట్టణంలోని పాశంవీధికి చెందిన శ్యామలమ్మ అనే ఆవేదన వ్యక్తం చేసింది. ఇటీవల రెండు ఆవులను కొనుగోలు చేసి తమ పశువుల పాకలో కట్టవేసినట్లు తెలిపారు. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని దుండగులు రెండు ఆవులను తీసుకెళ్లారని తెలిపారు. అపహరణకు గురైన ఆవుల విలువ సుమారు రూ.2 లక్షల వరకు ఉంటుందన్నారు. ఆవులపై ఆధారపడి జీవిస్తు న్నామని,ఆవులు దొంగలు తీసుకెళ్లడంతో జీవనాధారం కోల్పోయామని కన్నీటి పర్యంత మయ్యారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఆదుకోవాలని వేడుకున్నారు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE, PENUKONDA
SRI SATHYA SAI DIST
E.A.No.40/2023 in
E.P.No.1/2013 in O.S.35/1992
Between:
Rangamma Died by Lrs Kamsala Rajeshwari and Others ...Petitioner
And
Saradamma & Others ...Respondents
Notice to Respondents 4 to 7
4.M.V.Jyothi, W/o.M.V.Thulasiram
5.M.V.Thrilochana, W/o.Nagachari
6.M.V.Gayathri, W/o.Karthik
7.M.V.Bindu, D/o.M.V.Thulasiram
4 to 7 Residing at Kodumur village and Mandal, Annamayya District.
పై దావా E.P.No.1/2013లో [illegible] E.A.No.40/2023 [illegible] 20/01/2025 [illegible]
[illegible]
అడ్వకేట్, పెనుకొండ.

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE : LAKKIREDDIPALLI
O.S.No. 128 /2024
Yarranagu Jagan Mohan Reddy S/o Sidda Reddy, aged about 28 years, Hindu, Private employee, resident of Door No. 13/66, Appakondaiahgari palli Kaspa, Lakkireddipalli village & Mandal, Annamayya district. ...Plaintiff
Vs
D2. Bojanapu Rama Devi, W/o Ramesh, aged about 40 years, Hindu, House wife & cultivation, Appakondaiahgaripalli Khaspa, H/o Lakkireddi palli Village & Mandal, Annamayya District. ...Defendants
SUMMONS & NOTICES TO DEFENDANTS NO.2
Please take notice that the above suit filed against all the defendants for partition of the suit property. The said suit and injunction petition IA.No. 1624 and 1625/2024 is posted for your appearance on 21-01-2025 at 10-30 AM. On that day you should appear before the Hon'ble court and file your objections if any, if you did not appe ar on that day, the above suit & injunction petition will decide in your absence as set exparte.
//By Order of the Court//
V.BALAJI REDDY, B.A.,B.L.,
Advocate for Plaintiff,
LAKKIREDDIPALLI.

రూపాయి పతనం ప్రమాదకరం

- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రపంచ మార్కెట్లో రోజు రోజుకూ రూపాయి పతనమవడం చాలా ప్రమాదకరమని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి పేర్కొన్నారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాజాగా డాలరుతో రూపాయి మారకం విలువ ఎన్నడూలేని విధంగా రూ.86కు పడిపోయిందని చెప్పారు. దేశ చరిత్రలోనే ఇది అత్యంత కనిష్టస్థాయి అన్నారు. 2014లో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం దిగిపోయే నాటికి ఒక అమెరికన్ డాలర్ విలువ రూ.62.33 ఉండేదన్నారు. ఆనాడు మోడీతోపాటు బిజెపి నాయకులు తీవ్రంగా విమర్శలు చేశారన్నారు. బిజెపి అధికారంలోకి వస్తే రూపాయిని బలోపేతం చేస్తామని చెప్పారని గుర్తు చేశారు. బిజెపి అధికారంలోకి వచ్చాక రూ పాయి విలువ మరింత పతనమైందని వివరించారు. ఇది దిగుమతులు, వాణిజ్య చెల్లింపులు, విదేశీ అప్పు చెల్లింపులపై తీవ్ర భారం పడుతుందన్నారు. ప్రస్తుతం మన వద్ద 635 బిలియన్ డాలర్ల విదేశీ మారక నిల్వలు ఉన్నాయన్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర ప్రమాదంలో చిక్కుకుంటుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రూపాయి మరింత పతనం కాకుండా కేంద్ర ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తున్నట్లు తులసిరెడ్డి చెప్పారు.

కిటకిటలాడిన పశువుల సంత

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు వారాంతపు పశువుల సంత శనివారం రైతులు, పశువులతో కిటకిటలాడింది. సంక్రాంతి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని పొట్టేళ్లు, మేకపోతులు, కోళ్ల అధికంగా సంతకు వచ్చాయి. ప్రజలు కూడా వాటిని కొనుగోలు చేసేందుకు అత్యధికంగా వచ్చారు. బుధవారం కనుమ పండుగ ఉండడంతో నాటుకోళ్లు, పొట్టేళ్లకు మంచి గిరాకీ ఏర్పడింది. వీటితోపాటు ఎనుములు, ఎద్దులు ఇతర జీవాలకు కూడా అధికంగా డిమాండ్ ఏర్పడింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పాడి రైతులు అధికంగా సంతకు వచ్చి కొనుగోలు చేపట్టారు.

నేడు శిల్పారామంలో ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

శిల్పారామంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆదివారం మహిళలకు చుక్కల ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు శిల్పారామం పరిపాలన అధికారి సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోటీలో పాల్గొను మహిళలు ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు శిల్పారామంలో తమ పేర్లు నేరుగా నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. పూర్తి వివరాలకు 88866 52010, 90002 58848 సెల్ నంబర్లను సంప్రదించాలని కోరారు.